# ఉపాధి కూలీలకు భరోసా



గండిపాళెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



పనుల వద్ద నీడ సౌకర్యం కల్పించిన అధికారులు (ఫైల్)

- రోజువారీ కూలీ నగదు రూ.300లకు పెంపు
- పెరుగుతున్న కూలీల సంఖ్య
- పనుల వద్ద మౌలిక వసతుల కల్పన
- ముమ్మరంగా జరుగుతున్న ఉపాధి పనులు

**వరికుంటపాడు:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, వలసల నివారణే లక్ష్యంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వారికి తోడ్పాటునందిస్తోంది. రోజువారీ కూలీ నగదు రూ.300లకు పెరగడంతో కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతోపాటు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో ఉపాధి పనులపై కూలీలు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కరోనా అనంతరం ఈ పనులపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. గతంలో రోజువారీ కూలీ నగదు రూ.200 నుంచి రూ.250 వరకు ఉండేది. ఏడాదికేడాది పెంపుదల చేస్తుండడంతో పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 64,510 జాబ్‌కార్డులు ఉండగా.. రోజువారీ పనులకు హాజరయ్యే కూలీలు 23,659 మంది ఉన్నారు.

**ఉదయగిరి క్లస్టర్ పరిధిలో..**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉదయగిరి క్లస్టర్ పరిధిలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో పనులు జరుగుతున్నాయి. ఆయా మండలాల్లో రోజువారీ కూలీల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

**రోజువారీ వేతనం రూ.300**

ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీలకు గతంలో కూలీ రూ.278 ఉండేది. ఈ మొత్తాన్ని రూ.300లకు పెంచారు. ఫలితంగా చేసిన పనిని బట్టి కూలీ నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. పెరిగిన కూలీ నగదుతో ఉపాధి కూలీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో కన్నా ప్రస్తుతం ఉపాధి కూలీ పనులకు వచ్చేవారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది.

**గ్రామాల అభివృద్ధి**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వారి స్వస్థలాల్లోనే పనులు దొరుకుతుండడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు సైతం జరుగుతున్నాయి. పనుల వద్ద కూలీలకు నీడ సౌకర్యం, తాగునీటి వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ ఉపాధి సిబ్బంది అందుబాటులో ఉంచుతున్నారు. అవసరమైన పనిముట్లు అందిస్తున్నారు.

**ప్రస్తుతం చేపట్టే పనులు**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కుంటలు, ఊరచెరువులు, పంటకాలువల్లో పూడికతీత పనులు, రైతువారీ కుంటలు, హార్టికల్చర్ సాగు పనులు చేపడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,500 ఎకరాల్లో హార్టికల్చర్ చేపట్టాలని లక్ష్యం కాగా.. పూడికతీత పనుల ద్వారా బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పెరుగుతున్నాయి.

**అధికారుల తాజా గణాంకాల ప్రకారం**

| మండలం | జాబ్‌కార్డులు |
|---|---|
| ఉదయగిరి | 7,300 |
| సీతారామపురం | 6,400 |
| దుత్తలూరు | 7,010 |
| వరికుంటపాడు | 8,200 |
| వింజమూరు | 7,200 |
| కలిగిరి | 8,500 |
| కొండాపురం | 10,700 |
| జలదంకి | 9,200 |

### కూలీల సంఖ్య పెరుగుతోంది



ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని 8 మండలాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కూలీ నగదు పెంపుతో కూలీలు పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. పూడికతీత, హార్టికల్చర్ పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉపాధి పనులను ప్రతిరోజూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

– గాయత్రీదేవి, ఏపీడీ, ఉదయగిరి క్లస్టర్

### ఉపాధి పని ఉపయోగకరం



ఉపాధి హామీ పథకం పనులు మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగకరం. కూలీ నగదు గతంలో కన్నా పెంచి సకాలంలో చెల్లిస్తున్నారు. పనుల వద్ద వసతులు కల్పిస్తున్నారు. కుంటలు, చెక్‌డ్యాంలు, పంటకాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నాం. ఈ పనులు మా గ్రామానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– ఎం.చిన్న ఓబులమ్మ, టీసీపల్లి, వరికుంటపాడు మండలం

## క్లుప్తంగా

### గణనాథునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వినాయకస్వామి

**మనుబోలు :** మనుబోలు బీసీ కాలనీ సమీపంలో వెలసిన శ్రీవరసిద్ధి వినాయకునికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయకర్తలుగా పముజుల పరంధామయ్య, శివానందమ్మ దంపతులు వ్యవహరించారు.

### ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం



దుకాణదారులతో మాట్లాడుతున్న స్వర్ణ టోల్‌వే సిబ్బంది

**మనుబోలు :** మండల కేంద్రమైన మనుబోలు వైఎస్సార్ సర్కిల్ వద్ద హైవే స్థలం ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించేందుకు స్వర్ణ టోల్‌వే సిబ్బంది నడుం బిగించారు. ఈ మేరకు శని, ఆదివారాల్లో స్వర్ణ టోల్‌వే సిబ్బంది వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద మనుబోలు గ్రామంలోకి వెళ్లే రోడ్డు, హైవేకి మధ్యలో త్రిభుజాకారంలో సుమారు 20 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. ఇక్కడ పలువురు కూరగాయలు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడ టిఫిన్ దుకాణం నడుపుతున్న ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం అంగడికి రేకులు వేసే క్రమంలో వేపచెట్టు కొమ్మ అడ్డుగా ఉందని కొట్టేశాడు. బస్సులు, ఆటోల కోసం వేచి చూసే ప్రయాణికులకు నీడనిస్తున్న వేపచెట్టు కొమ్మను నరికేయడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రేకుల షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న పోలీసులు సదరు దుకాణ యజమానిని పిలిపించి హెచ్చరించి పంపించారు. టిఫిన్ దుకాణం యజమాని శుక్రవారం మరోసారి తాత్కాలికంగా షెడ్డు వేయడంతో స్థానికులు స్వర్ణటోల్‌వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన స్వర్ణ టోల్‌వే మేనేజర్ విక్రమ్‌రెడ్డి ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

### దంపూరులో రక్తదాన శిబిరం



**విడవలూరు :** మండలంలోని దంపూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మద్దులూరు పద్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లి కిశోర్ మాట్లాడుతూ యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రక్తదాతలకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు




**ఇందుకూరుపేట :** మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన్ తదితర మతాలకు సంబంధించి ప్రార్థనలు జరిగాయి. తొలుత ఆశ్రమంలోని మహాత్మ గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మనోజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు పొంగళ్లు

**జలదంకి:** మండలంలోని బ్రాహ్మణక్రాక, చామదల, జలదంకి తదితర గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మ ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామస్తులు అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

**దుత్తలూరు:** కొత్తగా 11 కేవీ విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో దుత్తలూరు మండలం నర్రవాడ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ నర్రవాడ రూరల్ అగ్రికల్చర్ ఫీడర్‌కు సంబంధించి సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి త్రీఫేజ్ సరఫరా ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. తర్వాత మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నర్రవాడ, తెడ్డుపాడు గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

## ఉత్సవాలకు అనుమతులు లేవు

**మర్రిపాడు:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మర్రిపాడు మండలంలో జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి ఉత్సవాలు, ఊరేగింపులకు అనుమతులు లేవని ఎస్సై విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులకు తెలియకుండా ఎవరైనా ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. కావలిరూరల్ మండలం మాతినవారిపాళెం గ్రామంలో ఇటీవల అతిసార బారినపడిన వారిని ఆ గ్రామానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతినవారిపాళెంలో గత వారం రోజులుగా పలువురు అతిసార కారణంగా ఆస్పత్రి పాలయ్యారని, ఇక్కడి పరిస్థితులను తెలుసుకుని వైద్యారోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసి బాధితులకు వైద్యసేవలు అందించేలా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపామన్నారు. బాధితులు త్వరగా కోలుకుని డిశ్చార్జి అయి గ్రామానికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవని తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# తూకానికి పాఠ్యపుస్తకాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

**సోమశిల:** అనంతసాగరంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఉండాల్సిన పాఠ్యపుస్తకాలు శనివారం తూకం దుకాణంలో దర్శనమిచ్చిన ఘటనపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ ఆదివారం డిప్యూటీ ఈఓ టి.గోపాల్ అనంతసాగరానికి విచ్చేసి విచారణ జరిపారు. ముందుగా మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన పుస్తకాలను పరిశీలించి ఎంఈఓ–1 బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను, కార్యాలయ సిబ్బందిని, పాఠ్యపుస్తకాలు కొన్న దుకాణదారుడిని విచారించారు. అనంతరం ఎంఈఓలతో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను స్క్రాప్‌గా విక్రయించే హక్కు ఎంఈఓలకు లేదని, స్క్రాప్‌గా విక్రయించాలంటే రాష్ట్రస్థాయి అధికారుల అనుమతి తీసుకుని జిల్లాస్థాయి అధికారులకు ఆ స్టాక్‌ను అప్పగించాలన్నారు. అనంతరం అనంతసాగరం జెడ్పీ హైస్కూల్‌కు ఇటీవల వచ్చిన పాఠ్యపుస్తకాలను, స్టాక్ పాయింట్లను పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న తదితరులు ఉన్నారు.



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ

# ప్రతిభావంతులకు నగదు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం



పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

- విద్యార్థులకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సాహం

**ఆత్మకూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆత్మకూరు పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులను సాధించిన ఆత్మకూరు పట్టణం, రూరల్ పరిధిలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమతులు అందజేసినట్లు కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే 500 పైన – 575 లోపు మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతోపాటు అధిక మార్కులు సాధించిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ముగ్గురికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం నారాయణరావు, చైతన్య భాస్కర్‌రెడ్డి, ప్రతిభా రామ్మోహన్‌రెడ్డి, సోమవరపు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 31 నుంచి వీరాంజనేయ స్వామి ఉత్సవాలు

**దుత్తలూరు:** మండలంలోని వెంకటంపేటలో వీరాంజనేయస్వామి ఉత్సవాలు ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ నెల 31న ఉదయం 7 గంటలకు గణపతిపూజ, కలశపూజ, సహస్రనామ పూజ, జూన్ ఒకటో తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి అభిషేకం, హోమం, రాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 2న ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. ఈ మూడు రోజులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధ్యాయుడికి అంబేడ్కర్ పురస్కారం



ఉపాధ్యాయుడు శివశంకరయ్య

**మర్రిపాడు:** దేశంలో తెలుగు మాట్లాడే అన్ని ప్రాంతాల వారికి చిత్రలేఖనం విభాగంలో పోటీలు నిర్వహించగా.. అందులో ప్రతిభ కనబరిచిన మర్రిపాడు మండలం చుంచులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మున్నెల్లి శివశంకరయ్య అంబేడ్కర్ పురస్కారానికి ఎంపికైనట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. తాను ఒకే దారంతో అంబేడ్కర్ చిత్రపటాన్ని రూపొందించిన నేపథ్యంలో ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు శివశంకరయ్య తెలిపారు.

## వైద్యశిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** మండలంలోని సర్వాయిపాళెం పంచాయతీ మాతినవారిపాళెం గ్రామంలో ఇటీవల పలువురు అస్వస్థతకు గురై కావలిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో మాట్లాడి ఆ గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఆదివారం ఎమ్మెల్యే ఈ వైద్యశిబిరాన్ని సందర్శించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

**పొదలకూరు :** ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు స్థానిక సాయిబాబా మందిరంలో ఈనెల 30న బహుమతులు అందజేస్తామని మందిర సేవాసమితి సభ్యుడు లక్కాకుల ఆనందరావు ఆదివారం తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మందిర సేవాసమితి ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# రమణారెడ్డి సేవలు మరువలేం




మాట్లాడుతున్న డేవిడ్‌రాజు

**ఆత్మకూరు:** పేదల కోసం నెల్లూరు నగరంలో ప్రజా వైద్యశాలను ఏర్పాటు చేసిన డాక్టర్ చెర్లో రమణారెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం డాక్టర్ రమణారెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ రమణారెడ్డి ఆశయాలు కొనసాగేలా ఇప్పటికీ వైద్యశాలలో తక్కువ ఫీజులతోనే వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రా రాజగోపాల్, మోహన్‌రావు, జి.లక్ష్మీపతి, ఎ.నాగయ్య, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# గొడవలకు దిగితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

**అల్లూరు:** ఎన్నికల ఫలితాల రోజున గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ హెచ్చరించారు. ఆదివారం అల్లూరు మండలం బీరంగుంట గ్రామంలో పోలీస్ యాక్ట్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే జీవితాంతం కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. ఈ గ్రామంపై తాము ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావు, కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాలతో వసంతోత్సవం



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

**ఉదయగిరి:** మండలంలోని ఆర్లపడియ గ్రామంలో శ్రీసీతారామస్వామి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలో వసంతోత్సవం నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంతోత్సవం, ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాములను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవంగా గ్రామ శివారులోని మామిడితోపులోకి పార్వేటకు తరలించారు. లంకాదహనంతో ఉత్సవాలు ముగించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

# గ్రావెల్ తవ్వకాలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం గ్రామంలో చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని చెరువు నుంచి నాలుగు టిప్పర్ల ద్వారా ఆత్మకూరుకు మట్టిని తరలిస్తున్న క్రమంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రెండు టిప్పర్ల డ్రైవర్లు పరారు కాగా మరో రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పొట్టు రవాణాతో తీవ్ర ఇబ్బందులు



వెంకటాచలంలో ఆగి ఉన్న పొట్టు ట్రాక్టర్లు

**వెంకటాచలం :** మండలంలో పొట్టు రవాణా ట్రాక్టర్ల రద్దీతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణపట్నం పోర్టు రోడ్డు వెంబడి ఉన్న వివిధ ఫ్యాక్టరీలకు నిత్యం నెల్లూరు నగరం నుంచి ట్రాక్టర్లు పొట్టు సరఫరా చేస్తున్నారు. అయితే నిబంధనలు పాటించకుండా రవాణా చేస్తుండడం ఇబ్బందులకు గురిచేస్తోంది. పొట్టులోడుతో వెళ్లే ట్రాక్టర్లు ప్లాస్టిక్ పట్టలు కట్టి, వెనుక వైపు వచ్చే వాహనచోదకులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలి. పొట్టును రవాణా చేసే నిర్వాహకులు పట్టలు సక్రమంగా కట్టకపోవడంతో వెనుక వచ్చే వాహనచోదకులు పొట్టు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొట్టు అన్‌లోడ్ చేసివచ్చే ట్రాక్టర్ల నుంచి కూడా వెనుక వచ్చే వాహన చోదకులకు ఇబ్బందులు కలుగుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పోలీసులు జోక్యం చేసుకుని పొట్టు రవాణా చేసే నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.